AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

03-10-2025 (Friday) MAIN EDITION

## భారత్ – చైనా మధ్య విమాన సర్వీసులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గల్వాన్ లోయలో 2020లో చోటుచేసుకున్న ఘర్షణల తర్వాత భారత్, చైనా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య విమాన సర్వీసులు రద్దయ్యాయి. అయితే ఇటీవల జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో రెండు దేశాల మధ్య జరిగిన చర్చల్లో కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో అక్టోబర్ 26 నుంచి భారత్, చైనా మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు మళ్లీ ప్రారంభం కానున్నాయి.

## రాహుల్ 'టెస్ట్' సెంచరీ..




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత ఓపెనర్ కేఎల్ రాహుల్ గర్జించాడు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత సొంత గడ్డపై టెస్ట్ సెంచరీ బాదాడు. టెస్టుల్లో ఆయనకు ఇది 11వ శతకం కాగా.. భారత గడ్డపై రెండవ సెంచరీ కావడం విశేషం. భారత్ ఇన్నింగ్స్ రెండో రోజున 121 ఓవర్లు పూర్తయ్యేసరికి నాలుగు వికెట్లు కోల్పోయి 411 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ 190 బంతుల్లో 12 బౌండరీలతో శతకాన్ని నమోదు చేశాడు.

## టమోటా వైరస్ కలకలం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మధ్యప్రదేశ్‌లో టమోటా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. భోపాల్‌లో పాఠశాల పిల్లల్లో ఈ వైరస్ విస్తరిస్తోంది. వైరస్ సోకిన పిల్లల చేతులు, పాదాలు, అరికాళ్లు, మెడ కింద, నోటిలో ఎర్రటి దద్దుర్లు వస్తున్నాయి. టమోటా వైరస్‌ను హ్యాండ్, ఫూట్, మౌత్ డిసీజ్ అంటారని వైద్యులు తెలుపుతున్నారు.

## అరేబియా సముద్రంలో తుపాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అరేబియా సముద్రంలో తుపాన్ ఏర్పడినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కి.మీ, పోర్‌బందర్‌కు 270 కి.మీ దూరంలో అల్పపీడనం ఏర్పడిందన్నారు. అది వాయుగుండంగా మారి గంటకు 12కి.మీ. వేగంతో కదులుతున్నట్లు వెల్లడించారు. దీనికి సైక్లోన్ శక్తి అని పేరు పెట్టారు.

## కొడంగల్‌లో 'దసరా గ్రీటింగ్స్'



**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో దసరా గ్రీటింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, నియోజకవర్గ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ముఖ్యమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, స్థానికులు తరలివచ్చారు.

## చెన్నైలో బాంబు బెదిరింపులు



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో ఈ ఉదయం వరుసగా వచ్చిన బాంబు బెదిరింపు కాల్స్ తీవ్ర ఆందోళన కలిగించాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయం, రాజ్‌భవన్, నటుడురాజకీయ నాయకుడు ఎస్వీ శేఖర్ నివాసాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్టు తెలుస్తోంది. గుర్తుతెలియని వ్యక్తులు పలు ఈమెయిల్ ఐడీల నుంచి బాంబు పెట్టామని హెచ్చరిస్తూ మెయిల్స్ పంపారు. ఈ మెయిల్స్ కారణంగా చెన్నైలోని కీలక ప్రాంతాల్లో ఒక్కసారిగా భద్రతా హెచ్చరికలు అమలులోకి వచ్చాయి. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఇవన్నీ బూటకపు బెదిరింపులే అని పోలీసులు ధృవీకరించారు.

## డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ దొరికిన మాజీ ఎన్ఎస్‌జీ కమాండో



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మాజీ ఎన్ఎస్‌జీ కమాండో డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయాడు. ముంబై ఉగ్రదాడికి పాల్పడిన టెర్రరిస్టులతో పోరాడిన కమాండో డ్రగ్స్ దందా నడుపుతూ దొరకడం చర్చనీయాశంగా మారింది. ఆయన తెలంగాణ, ఒడిశా నుంచి రాజస్థాన్‌కు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కాడు. రాజస్థాన్‌కు చెందిన బజరంగ్ సింగ్ ఏడేళ్ల పాటు నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోగా పని చేశాడు. రిటైర్ అయిన తర్వాత స్మగ్లింగ్ దందా మొదలు పెట్టాడు. ఒడిశా, రాజస్థాన్‌లోని నేరస్థులతో బజరంగ్ సంబంధాలు పెంచుకున్నాడు. భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ డబ్బులు సంపాదించడం మొదలు పెట్టాడు. దీంతో అతనిపై రాజస్థాన్‌కు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, యాంటీ నేషనల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆపరేషన్ చేపట్టి అరెస్ట్ చేశారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్'లో పాల్గొన్న నేతలు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు





# అలయ్ బలయ్

**హైదరాబాద్ నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా సాగింది. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె విజయలక్ష్మి ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో 2005లో ప్రారంభమైన ఈ కార్యక్రమం 20 ఏళ్లుగా కొనసాగు తోంది. శుక్రవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు హాజరయ్యారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్**

**నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఘనంగా కార్యక్రమం**

**పాల్గొన్న నేతలు, సినీనటులు**

**ప్రముఖులను సన్మానించిన బండారు దత్తాత్రేయ**

తెలంగాణ ఉద్యమ సమయంలో బండారు దత్తాత్రేయ రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం అలయ్ బలయ్ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా ఈ కార్యక్రమాన్ని 20 ఏళ్లుగా ఆయన నిర్వహిస్తున్నారు. ఈసారి ఆపరేషన్ సింధూర్ థీమ్ తో ప్రోగ్రాం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నారాయణ మాట్లాడుతూ.. బండారు దత్తాత్రేయ అందరికీ బంధువన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే దత్తన్న గుర్తొస్తాడని అన్నారు. కార్యక్రమం ఎంతో పాపులార్ అయిందని కొనియాడారు. మనం కొట్టుకున్నా.. తిట్టుకున్నా.. అలయ్ బలయ్ చేసుకుంటామన్నారు. కానీ రాయలసీమలో కొట్టుకోవడం, చంపుకోవడం పెరిగిపోయిందని ఆయన అన్నారు. వచ్చే అలయ్ బలయ్ రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎన్నికలప్పుడే పార్టీలు అని.. తర్వాత అందరం ఒకటే అనే భావన రావాలన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దత్తన్న మానవ సంబంధానికి అల్లిక అన్నారు. మానవత్వానికి ప్రతిక అన్నారు. ఒక పార్టీ నాయకుడు, మరో పార్టీ నాయకుడితో మాట్లాడితే నేరంగా పరిగణిస్తున్న ఈ రోజుల్లో అన్ని పార్టీల నాయకులను ఒక వేదికపైకి తీసుకు రావడం గొప్ప విషయమన్నారు. అనంతరం దత్తాత్రేయ పలువురిని సన్మానించారు.

## ముంబయి, కరీంనగర్ మధ్య ప్రత్యేక రైలు



**అక్షరటుడే, హైదరాబాద్:** దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. పండుగ రద్దీ నేపథ్యంలో కరీంనగర్ నుంచి ముంబయికు ప్రత్యేక రైలు నడపనున్నట్లు పేర్కొంది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినల్ నుంచి కరీంనగర్ వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే అధికారులు నడపనున్నారు. రైలు సంఖ్య 01021 ప్రతి శనివారం ముంబై నుంచి కరీంనగర్ వస్తోంది. ఈ నెల 11 నుంచి నవంబర్ 15 వరకు ఈ రైలు ప్రతివారం నడవనుంది. ముంబై నుంచి కరీంనగర్‌కు (01021) రైలు ప్రతి శనివారం రాత్రి 12 :20 గంటలకు బయలు దేరుతుంది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది. అనంతరం శనివారం 5:30 గంటలకు కరీంనగర్ (01022) నుంచి బయలుదేరుతుంది. ఆదివారం మధ్యాహ్నం 1:50 గంటలకు ముంబై చేరుకుంటుంది.

## పేలిన టీవీలు, ఏసీలు..




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** కుటుంబ సభ్యులు సరదాగా ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో ఒక్కసారిగా టీవీలు, ఏసీలు పేలిపోయాయి. హైదరాబాద్ నగరంలోని మూడు ఇళ్లలో సడెన్‌గా పేలుడు చోటు చేసుకోవడంతో ఆయా ఇళ్లలోని వారు ఆందోళనకు గురయ్యారు. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నగరంలోని సుచిత్రలో గల వసంత్ విహార్ కాలనీలోని పలు ఇళ్లలో శుక్రవారం ఎలక్ట్రానిక్ వస్తువులు పేలిపోయా యి. ఒకదాని తర్వాత ఒకటి చొప్పున వస్తువులు పేలడంతో ఏం జరుగుతుందో తెలియక ఆయా ఇళ్లలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మొత్తం మూడు ఇళ్లలో ఏసీలు, టీవీలు పేలాయి. హై వోల్టోజీ కారణంగా పేలుడు చోటు చేసుకుందని భావించారు. వెంటనే తేరుకొని ఇతర ఎలక్ట్రానిక్ వస్తువలకు కరెంట్ సరఫరా నిలిపి వేశారు. కాగా హై వోల్టేజీతో టీవీలు, ఏసీలు పేలిపోలేదని తేలింది. స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు ఎర్త్ అవ్వడంతో ఈ ఘటన చోటు చేసుకుందని తెలిసింది.



## శత్రు దుర్భేధ్యంగా 'సుదర్శన చక్ర'..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐఏఎఫ్ సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ తెలిపారు. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు రక్షణరంగంలో స్వావలంభన కోసం 'సుదర్శన చక్ర'ను తయారుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కవచంతో కీలకమైన వ్యవస్థలకు రక్షణ కల్పిస్తామని, దేశాన్ని శత్రు దుర్భేధ్యంగా తయారు చేస్తామని పేర్కొన్నారు. దీనికోసం ఇప్పటికే త్రివిధ దళాలు పనిని ప్రారంభించాయన్నారు. 2035 నాటికల్లా ఈ కొత్త భద్రతా వ్యవస్థ పనిచేయడం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారన్నారు.

## ట్రంప్ ఒత్తిడికి మోదీ తలొగ్గడు: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌పై అమెరికా సుంకాల నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వాల్దాయ్ చర్చా వేదికలో ఆయన మాట్లాడారు. మోదీ గురించి తనకు తెలుసని, ఆయన ట్రంప్ ఒత్తిడికి తలొగ్గే వ్యక్తి కాదని పేర్కొన్నారు. అమెరికా విధించిన భారీ సుంకాలతో కలిగే నష్టాలను భారత్ సమతుల్యం చేయగలదన్నారు. రష్యా - భారతదేశం మధ్య ఎప్పుడూ సమస్యలు, ఉద్రిక్తతలు లేవని చెప్పారు. భారతదేశంరష్యా సంబంధాన్ని ప్రత్యేకమైనదిగా ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీని తన స్నేహితుడు అని అన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయాలని అమెరికా ఒత్తిడిని పట్టించుకోకుండా భారతదేశం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు.

### నష్టాలను భర్తీ చేస్తాం

అమెరికా విధించిన సుంకాలతో భారతదేశం ఎదుర్కొంటున్న నష్టాలను రష్యా నుంచి ముడి చమురు దిగుమతుల ద్వారా సమతుల్యం చేస్తారని పుతిన్ అన్నారు. వాణిజ్య అసమతుల్యతను తొలగించడానికి, రష్యా భారతదేశం నుండి మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలను దిగుమతి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. 'బ్రిక్స్'ను ఏర్పాటు చేసిన ఇండియా, చైనాలకు పుతిన్ థాంక్స్ చెప్పారు. ప్రాచీన భారతీయ నాగరికత అంటే తమకు చాలా గౌరవం అని ఆయన తెలిపారు. ప్రధాని మోదీ తన దేశం గురించి మొదట ఆలోచించే తెలివైన వ్యక్తి అని పుతిన్ అన్నారు.

## యూట్యూబ్‌పై ఐశ్వర్యరాయ్ దావా



**బాలీవుడ్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ మరోసారి న్యూఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తమ అనుమతి లేకుండా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, అలాగే ఏఐ టెక్నాలజీ ద్వారా రూపొందించిన కంటెంట్‌ను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల తాను తీవ్రంగా నష్టపోయానని ఆమె ఆరోపించారు. దీనిపై ఆమె రూ.4 కోట్ల పరువు నష్టం దావా వేయడం చర్చనీయాంశమైంది. ఇదివరకే ఐశ్వర్య రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, ఆమె అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు, కంటెంట్‌ను వాడకూడదంటూ స్పష్టం చేసింది.**

**- అక్షరటుడే, సినిమా డెస్క్**

## కరూర్ తొక్కిసలాట.. హైకోర్టులో దళపతికి చుక్కెదురు



**అక్షరటుడే, చెన్నై :** తమిళనాడులో టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఇటీవల కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది మృతి చెందారు. కాగా దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని టీవీకే పార్టీ వేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతోనే తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు ఆ పార్టీ పేర్కొంది. ఈ ఘటనపై తమిళనాడు పోలీసులతో కాకుండా సీబీఐ విచారణ జరిపించాలని విజయ్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై శుక్రవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కోర్టు విజయ్ పార్టీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభ దశలోనే ఉందని కోర్టు పేర్కొంది. ఈ సమయంలో సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని తెలిపింది.

## టీసీఎస్ లేఆఫ్‌లు.. వారికి రెండేళ్ల జీతం

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రఖ్యాత ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లేఆఫ్‌ల ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుత ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలను తీర్చలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. అయితే, దీర్ఘకాలం కంపెనీతో అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం దాదాపు రెండేళ్ల వేతనం పరిహారంగా చెల్లించనుంది. ఈ ఏడాది జులైలో ప్రకటించిన 12 వేల మందికి లేఆఫ్‌ల ప్రకటనలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టింది. కంపెనీలో 10 - 15 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ తాజా లేఆఫ్‌లలో ఉద్యోగం కోల్పోయిన వారికి ఏడాదిన్నర వేతనాన్ని పరిహారంగా చెల్లిస్తారు. అదే 15 ఏళ్లు దాటిన వారికి గరిష్ఠంగా రెండేళ్ల వేతనంగా ఇస్తారు.